
# నవభూమి

## నల్లగొండ అనుబంధం



21 నవంబర్,2024 గురువారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


### జాం అయిన మురుగు కాల్వలను

# శుభ్రం చేయించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

◆ మురుగు కాల్వల్లో శాశ్వత పరిష్కారం జరగాలన్న బిఎల్ఆర్





**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–** మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ రౌండ్ వద్ద మురుగు కాల్వ జాం కావడంతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ బుధవారం నిలబడి శుభ్రం చేయించారు. గత కొన్ని సంవత్సరాలుగా వర్షం పడినప్పుడు డ్రైనేజ్ నిండిపోయి రోడ్డుపై నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో బిఎల్ఆర్ మున్సిపల్ కార్మికులతో పూర్తిగా శుభ్రం చేయించారు. మల్లి ఈ సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం జరగాలని ఆయన అన్నారు. అదేవిధంగా పట్టణంలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు.

# గంజాయి అమ్మినా సేవించినా కఠినమైన శిక్షలు

◆ అమ్మాయిలను వేధించినట్లయితే ఫోక్సో చట్టం క్రింద జైలు:షి టీం ఎస్ఐ నరేష్

**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–** గంజాయి డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలను అమ్మినా సేవించిన కఠిన శిక్షలు ఉంటాయని షీ టీం ఎస్ఐ కె.నరేష్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణం ప్రజారోగ్యం అనే కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు మంచి స్నేహితులతో సహవాసం చేయాలని చెడు వ్యసనాలకు అలవాటయిన వారితో సహవాసం చేస్తే జీవితం నాశనం అవుతుందన్నారు. ఒకసారి క్రైమ్‌లో పేరు నమోదయితే ఉద్యోగ అవకాశాలు కూడా కోల్పోతార న్నారు. డ్రగ్స్ గంజాయికి అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అమ్మాయిలను వేధించినా, సోషల్ మీడియాలో అ సభ్యకర మెసేజ్ పంపినా పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయని, గంజాయి డ్రగ్స్‌కు సంబంధించి ఏమైనా సమాచారం ఇవ్వాలి అనుకుంటే 100కు కాల్ చేయాలని ఫోన్ చేసిన వారి పేరు గోప్యంగా ఉంచడం జరుగుతుందని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ షరీఫ్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, జె కొండల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, ఆంగ్ల అధ్యాపకులు రాజరత్నం, కళ్యాణ్ మంగయ్య, శ్రవణ్ అశోక్ పాల్గొన్నారు




### సీఎం రేవంత్ రెడ్డి

# దిష్టిబొమ్మ దహనం

◆ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపిశ్రేణులు





**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి నవంబర్ 20** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బుధవారం వరంగల్లో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యన్నం శివకుమార్ పార్టీ శ్రేణులతో కలిసి దిష్టిబొమ్మ దాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేషరతుగా సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని తాను చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనుకకు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షులు డబ్బికార సాహెష్, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గంజి బసవలింగం, కిసాన్ మూర్ఛ రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి ,జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు చెరుకు వెంకటేశం, టౌన్ ప్రధాన కార్యదర్శి గోలనుకొండ ప్రభాకర్, మండల కార్యదర్శి వెంకటేశం, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కా రెడ్డి ,నాయకుల గోదాసు లింగస్వామి, ఎర్ర లక్ష్మణ్ బడుగు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్







**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–**మిర్యాలగూడ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారణ స్వాముల కోసం ఆలయ కమిటీ సభ్యులు గుడిపాటి నవీన్ బ్రదర్స్, బండారు కుశలయ్యల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మొదటి రోజు బుధవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కార్యక్రమ నిర్వాహకులతో కలసి స్వాములకు అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ స్వాములు అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమానికి సహకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గుడిపాటి నవీన్ బ్రదర్స్, బండారు కుశలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి. స్కై ల్యాబ్ నాయిక్, నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, ఉబ్బపల్లి కాశయ్య,అమృతరెడ్డి, చల్ల వెంకన్న, బూడి సైదులు, షాగం జలంధర్ రెడ్డి, బాసానీ గిరి, వెంకట్రామిరెడ్డి, బల్గు శ్రీనివాస్, కౌన్సిలర్లు దేశిది శేఖర్ రెడ్డి, రవినాయక్, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

### తిమ్మాపురం (హాలియా) వాసి ఇసురాజు సైదులు యాదవ్‌కి

# ఓయూ డాక్టరేట్

**నల్గొండ– నవభూమి, నవంబరు 20:** నల్లగొండ జిల్లా తిమ్మాపురం హాలియా కు చెందిన ఇసురాజు సైదులు యాదవ్ ప్రతిష్టత్మాకమైన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పి హెచ్డీ పట్టాను పొందారు. ఆర్ట్స్ కాలేజీలోని తెలుగు డిపార్ట్మెంట్ కు చెందిన సైదులు యాదవ్ “తెలంగాణ నవలలు– వస్తు వైవిధ్యం” అనే అంశంపై పరిశోధన చేశారు. తెలుగు ఆచార్యులు ననుమాస స్వామి పర్యవేక్షణలో ఈ పరిశోధన కొనసాగింది. తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కమలాకర శర్మ ఆధ్వర్యంలో తన పరిశోధన పత్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీకి సమర్పించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అనుముల హాలియా మండలానికి చెందిన సైదులు యాదవ్ తన స్వగ్రామమైన తిమ్మాపురంలో ప్రాథమిక విద్యాభ్యాసం మూడో తరగతి వరకు హాలియా ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదు తరగతులు,ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాలియాలో, నాగార్జున జూనియర్ కాలేజీ హాలియాలో ఇంటర్మీడియట్, రామకృష్ణ డిగ్రీ కళాశాల హాలియాలో డిగ్రీ పూర్తి చేయగా, యం. ఎ. తెలుగును తెలుగు యూనివర్సిటీ హైదరాబాద్ లో పూర్తి చేశారు. నెట్ (జాతీయ అర్హత పరీక్ష)లో క్వాలిఫై అయిన సైదులు యాదవ్ జనరల్ క్యాటగిరి లో జె ఆర్ ఎఫ్ (జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్) కు ఎంపికయ్యారు.ఉస్మానియా యూనివర్సిటీలోని తెలుగు శాఖలు పీహెచ్డీ ప్రవేశం పొంది తన పరిశోధన పూర్తి చేశారు. 2019 లో తెలుగు అధ్యాపకుడిగా జనరల్ క్యాటగిరిలో ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన సైదులు యాదవ్ ప్రస్తుతం యాదాద్రి జిల్లాలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్నారు.



ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా తెలంగాణ ఉద్యమంతో పాటు పలు సామాజిక ఉద్యమాలలో క్రియాశీలక పాత్రను పోషించారు. అత్యంత కింది స్థాయి నుంచి వెళ్లి వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పి హెచ్డీ పట్టాను సాధించడం పై సైదులు యాదవ్ తల్లి లక్ష్మమ్మ ఆనందం వ్యక్తం చేశారు. పట్టాను పొందిన సైదులు యాదవ్ కు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, తిమ్మాపురం గ్రామస్తులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు. తనకు పి హెచ్డీ పట్టా రావడంపై ఇసురాజు సైదులు యాదవ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. “వందేళ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీలో పిహెచ్డీ పూర్తి చేయటం గర్వంగా ఉంది. కింది స్థాయి నుంచి సాగిన నా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఎప్పటికీ ఋణపడి ఉంటాను. సమాజ అభివృద్ధిలో ఎల్లప్పుడూ నా వంతు పాత్ర పోషిస్తాను విద్యార్థుల భవిష్యత్తుకై నిరంతరం కృషి చేస్తాను” అని తెలిపారు.

### డిసెంబర్ 2,3,4న మిర్యాలగూడలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలు

# జయప్రదం చేయాలి



సిపిఎంరాష్ట్రకమిటీ సభ్యులు మల్లేష్

**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–**సిపిఎం 21వ జిల్లా మహాసభలు సందర్భంగా డిసెంబర్ 2న మిర్యాలగూడ లో జరిగే బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ పిలుపు నిచ్చారు. బుధవారం మిర్యాలగూడ మండల కమిటీ సమావేశం మిర్యాలగూడ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పోరాటాలు లేనిదే పాలక పక్షాలు తమ ఇష్టానుసారంగా పెట్టుబడిదారులకు అనుకూలం గా పాలనా కొనసాగిస్తాయని, ప్రజా వ్యతిరేక విధానాలను నికరంగా నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రజల అభివృద్ధి ఏజెండా పక్కకు పోయి పెట్టుబడిదారులు దోపిడీదారులకు అనుకూలమైన విధానాలు తీసుకొని దేశాన్ని దివాలా తీయిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటిలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లకముందే ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని సంక్షేమానికి సంబంధించిన నిధులు విడుదల కావడం లేదని అన్నారు.రైతులు పండించిన వరి పత్తి వెంటనే కొనుగోలు చేసి డబ్బులు రైతులు ఖాతాలో వేయాలన్నారు. సిసిఐ ద్వారా పత్తిని కొనుగోలు వేగవంతం చేసి పత్తి రైతులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐయం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఎం.రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, సీనియర్ నాయకులు పి.రామూర్తి, మండల నాయకులు కందుకూరు రమేష్, కన్నెకంటి రామకృష్ణ, పోలేపల్లి గోవిందరెడ్డి, చనగాని సైదమ్మ, చౌగాని వెంకన్న, ఉన్నం వెంకటేశ్వర్లు, పురాణపు లింగయ్య, మట్టపల్లి వెంకటేశ్వర్లు, పొదిల శ్రీనివాస్, బొగ్గారాపు కృష్ణ, కాంతరెడ్డి, నాగేశ్వరావు, నాగ్ హుస్సేన్, నాగేంద్ర ప్రసాద్, మంగ, పద్మ పాల్గొన్నారు.

# కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్ళ జోళ్లు పంపిణి చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–**మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం టీకె రంగాచార్య – రంగనాయకమ్మ స్మారక లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రిలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాధవి దంపతుల ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ పూర్తయిన వారికి కళ్ళజోడ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా కంటి పరీక్షలు, చికిత్స అందిస్తూ వారికి చూపుని అందిస్తున్న లయన్స్ క్లబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే వారి సేవలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలలో కూడా వారి సేవలను అందిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మాధవి, ప్రముఖ రైస్ మిల్లర్ గుడిపాటి నవీన్, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ జె.రాజు, డైమండ్ శ్రీనివాస్, మాషెట్టి లింగయ్య, జొన్నలగడ్డ మల్లారెడ్డి, మొక్కపాటి వేంకటేశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

### జూలూరు పిఏసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి నవంబర్ 20** ఎలాంటి ఆధారాలు లేకుండా నాపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని జూలూరు పిఏసిఎస్ చైర్మన్ అందెల లింగం యాదవ్ హెచ్చరించారు. పురపాలక కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో పాలకవర్గ సభ్యులు సరైన రీతిలో సంస్థకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించలేదని నాపై సీఈఓ పై డిపార్ట్మెంట్ కు ఫిర్యాదు చేయగా డిపార్ట్మెంట్ కు సంబంధించిన అధికారులు నాకు షోకాజ్ నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఎంక్వయిరీ అధికారి సరైన రీతిలో డబ్బులను లావాదేవీలు నిర్వహించటం లేదని ప్రతిగా ప్రతి దానికి తీర్మానం కచ్చితంగా నిర్వహించాలని ఎంక్వయిరీ అధికారులు నిర్ధారించి వెళ్ళగా. ఆధారాలు లేని విషయాలతో 52 లక్షల రూపాయల అవినీతి జరిగిందని పాలకవర్గానికి సంబంధించిన మాజీ వైస్ చైర్మన్ డైరెక్టర్లు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పదేపదిగా నాపై అబాండాన్ని వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇంతవరకు ఎలాంటి తప్పులు చేయలేదని అలాంటి నాపై పదేపదేగా ఎలాంటి రుజువులు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఆయన అన్నారు. సరైన ఆధారాలతో నా ప్రతిపక్షం ,అధికార పక్షం, రైతులు, మాజీ డైరెక్టర్లు అయిన రుజువులతో వస్తే నా పదవికి రాజీనామా చేయడమే కాక బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాలు విసిరారు.ఆరోపణలు చేస్తూ పత్రికల ద్వారా ప్రచారం చేసిన మాజీ వైస్ చైర్మన్ వాకిట మల్లారెడ్డి తో పాటు డైరెక్టర్లకు పరువు నష్టం దావా కింద కోర్టు ద్వారా లీగల్ నోటీసులు కోర్టు ద్వారా పంపిస్తున్నానని ఆయన అన్నారు.మరోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

### కల్తీ ఎరువులు క్రిమి సంహారక మందులు

# అమ్మిన ఏడుగురిపై పిడి యాక్టు



### డిఏఓ శ్రవణ్ కుమార్

**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–** నల్లగొండ జిల్లాలో కల్తీ ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించిన ఏడుగురు వ్యాపారులపై పిడి యాక్టు కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రైతు వేదికలో విలేఖరులతో మాట్లాడుతూ అడివిదేవులపల్లి సంఘటన అనంతరం అప్రమత్తమై జాగ్రత్తలు చేపట్టామని ఆయన తెలిపారు. జిల్లాలో రబీ సీజన్ కు గాను అన్ని రకాల ఎరువులు సుమారు 57,000 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ ఉన్నాయని తెలిపారు. యూరియా 27,700 మెట్రిక్ టన్నులు, పొటాష్ 23,000 టన్నులు, కంప్లెక్స్ ఎరువులు 14,000 టన్నులు, సూపర్ ఫాస్ఫేట్ 14,000 టన్నులు మొత్తం 57,000 టన్నులు నిల్వ ఉన్నాయని తెలిపారు. రబీ సీజన్లో సుమారు 5.4లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశముందని ఆయన తెలిపారు. సాగు విస్తీర్ణం పెరిగితే అందుకు తగ్గట్టు ఎరువుల కోసం రిక్విజిషన్ పెడతామని ఆయన తెలిపారు. గత ఖరీఫ్ లో 5.2లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని సుమారు 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని ఆయన తెలిపారు. ఇంకా 40 వరికోతలు పూర్తి కావాల్సి ఉందని ఆయన అన్నారు. ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 7.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని ఆయన అన్నారు. నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాల్లో. వరి సాగు ముందు చేయడం ముందుగా అమ్మకానికి వచ్చిందన్నారు. రైతులు నానో యూరియాను వాడాలని సలహా ఇచ్చారు. వరి కొయ్య కాలు కాల్చడం వల్ల వాయువు కాలుష్యం పెరుగుత్తుందని, భూసారం తగ్గి పోతుందని ఆయన తెలిపారు. కాల్చితే డిల్లీ పరిస్థితి జిల్లాలో ఏర్పడుతుందని ఆయన అన్నారు. అంతకు ముందు ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన ఎరువులను విక్రయించాలని కోరారు. ధరల పట్టిక ప్రతి దుకాణంలో పెట్టాలని కోరారు. సమావేశంలో ఎడిఎ బి. దేవ్ సింగ్, మండల వ్యవసాయ అధికారులు డి.సైదానాయక, గుర్రం సరిత, ఋష్యేంద్రమని, శివకుమార్, ఉషారాణిలు పాల్గొన్నారు.

### పది గంటలు క్లిష్టతర శస్త్ర చికిత్స చేసి యువకుడి

# ప్రాణాలు కాపాడిన యశోద వైద్య బృందం

**మిర్యాలగూడ నవభూమి, నవంబర్ 20:–** అత్యాధునిక వైద్య సేవలతో యశోద హాస్పిటల్ పోలీట్రామా కేసుల్లో భాగంగా పదిహేడేళ్ల బానవత్ నితిన్ రోగి ప్రాణాలను సుమారు 10 గంటల క్లిష్టతర శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను యశోద హాస్పిటల్ వైద్య బృందం కాపాడిందని హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్ రెడ్డి, జనరల్ మేనేజర్ చిదుర శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆధునిక కాలంలో వైద్యరంగంలో వచ్చిన అత్యాధునిక కీలక మార్పులు పోలీట్రామా స్థితిలో రోగిప్రాణాలను కాపాడేందుకు సాయపడతాయని సకాలంలో రోగి స్థితిగతుల్ని అంచనా వేసి యుద్ధ ప్రాతిపాదికన శస్త్ర చికిత్సలు చేసి అత్యాధునిక వైద్య సేవలను అందించగలిగితే పోలీట్రామా కేసులలో రోగి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదంలో త్రివంగా గాయపడిన పోలీట్రామా స్థితిలో ఉన్న బాణావత్ నితిన్ యువకుడి ప్రాణాలను మలక్ పేటలోని యశోద హాస్పిటల్ వైద్య బృందం 10 గంటల పాటు అత్యంత క్లిష్టతర శస్త్ర చికిత్స చేసి కాపాడిందన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ సాయుజ్ కృష్ణన్, యశోద ఆర్తోపెడిక్ సర్జన్స్ డాక్టర్ ప్రఫుల్, డాక్టర్ పుష్పక్ లతో కలిసి 10 గంటల పాటు శ్రమించి రోగికి శస్త్ర చికిత్స చేశారని తెలిపారు. రోగి తలలోని ఫ్రాక్చర్స్ ని సరిచేసి మెదడుపై అదనపు భారం పడకుండా అడ్డుకున్నారని, బోన్స్ ఫ్రాక్చర్ ను ముంజేతుల్లో ఫ్రాక్చర్స్ ని సరి చేశారని తెలిపారు. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ చంద్రమౌళి ముఖంలో ఫ్రాక్చర్ అయిన ఎముకలని సరిచేసి అతని ముఖ భాగాల పనితీరును సరిదిద్దారని తెలిపారు. శస్త్ర చికిత్స తదుపరి నితిన్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో తరలించారని వెంటిలేటర్ను రక్తపోటును అదుపులో ఉంచే అత్యాధునిక వైద్య పరికరాలను అమర్చారని రోగి వీలైనంత త్వరగా కోలుకోవడంలో ఆరోగ్యం పుంజు తీసుకోవడంలో వైద్య బృందం వైద్య సేవలు అమోఘమన్నారు. శస్త్ర చికిత్స అనే అత్యవసర వైద్య సేవల విభాగానికి చెందిన వైద్యులు సమన్వయంతో నితిన్ ప్రాణాలను కాపాడారని ఈ కేసు అత్యాధునిక పరిజ్ఞానం ప్రమాణాలతో కూడిన యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సమర్ధతతో పని చేశారన్నారు. నితిన్ ఆరోగ్యం కుదుటపడంతో వెంటిలేటర్ను రక్తపోటు నియంత్రణ పరికరాలను తొలగించామని ఇప్పుడు అతను తనకు తానుగా శ్వాస తీసుకో గలుగుతున్నాడని తెలిపారు. రోగి శారీరక క్రియల స్థితి సాధారణ స్థితికి చేరుకుందని ఇప్పుడు వేగంగా కోలుకోవడానికి కావలసిన వైద్య సేవలు పోస్ట్ ఆపరేటివ్ రికవరీ బృందాలు అందించాయని తెలిపారు. ఈ సందర్భంగా తమ కుమారుడు నితిన్ ప్రాణాలను కాపాడిన యశోద హాస్పటల్ వైద్య బృందానికి తల్లిదండ్రులు హరిచంద్ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. బహుళ గాయాలకు గురైె చికిత్స పొందిన నితిన్ మాట్లాడుతూ ఆరోగ్యం కుదటపడిందని, ఆరోగ్యం గానే ఉన్నానని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు ప్రతి ఒక్కరు సీటు బెల్టు విధిగా పెట్టుకుని ప్రయాణం చేయాలని కోరారు. సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ సాయుజ్ కృష్ణన్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రఫుల్, ఎ. వాసుకిరణ్ రెడ్డి పాల్గొన్నారు.



